# కథ కానిదీ కథ!

ప్లాట్‌ఫాం మీదికి అడుగుపెట్టిన అర్ధ నిమిషానికే ట్రైన్ వచ్చింది. జనం లోపలి కెక్కిన ప్రతి ఒక్కరికీ లక్షరూపాయలు యిస్తారన్నంతహడావిడిగా ఎక్కసాగారు.

అయిదు నిమిషాలకు యింకో ట్రైన్ వస్తుందిగా అని ఆగి కాఫీ త్రాగటానికి కాంటీన్ వైపు నడిచాను.

సరిగ్గా అందుకోసం తల తిప్పి చూసి నప్పుడే అతణ్ణి చూశాను.

అతను .... నలిగిన పాంటు, నలిగిన షర్టు, ముఖంలో ఆకలి. ..నిరుద్యోగి అను కోపడానికి సందేహం లేదు. మొత్తంమీద నన్ను అమితంగా ఆకర్షించింది అతని చూపులు. అవి దొంగచూపులకు మల్లే వున్నాయి. ఎవరూ చూడ్డం లేదుకదా నన్నట్లు చూపినవైపే చూస్తూ ఎనిమిది దిక్కుల్నీ లెక్కపెడుతున్నాడు. నలుగురు ఒకచోట వుంటే వాళ్ళ వెనక్కి వెళ్ళి కాసేపు నిలబడుతున్నాడు.

నాకు యింటిదగ్గర పెద్ద పనేమీ లేదు. తాపీగా సిగరెట్టు వెలిగించి నిలబడ్డాను. ఆ వ్యక్తి అటూ యిటూ యింకోమారుచూసి కాంటీన్ గోడ పక్కనే తిన్నెమీద ఎవరో తాగేసిపెట్టిన కాఫీగ్లాసు. చేతిలోకి ఎత్తు కున్నాడు. నా గుండె ఝల్లుమంది. గ్లాసులో మిగిల్చిన ఒకటి రెండు గుక్కల్ని తాగేసి మూతి తుడుచుకుని మళ్ళీ వచ్చి అతను మనుషులమధ్య నిలబడ్డాడు. తను చేసిన పని ఎవరూ గమనించలేదుకదా అన్నట్టు చుట్టూ ఓమారు చూసి నిలబడి కాఫీ తాగుతున్న వాళ్ళు ఒక్కొక్కరు ఎంత కాఫీ మిగులుస్తారా అని ఆశగా చూడసాగాడు.

నేను భారంగా ముందుకు కదిలి కాఫీ తీసుకుని నెమ్మదిగా త్రాగుతూ ఆ వ్యక్తిని నేను గమనిస్తున్నానని అనుకోడానికి అవ కాశం లేకుండా అతనివైపు చూడసాగాను.

నేను కాఫీ సగం తాగేలోపలే యింకె వ్వరో గ్లాసులో సగానికి సగం వదిలిపెట్టి వెళ్ళిపోయారు. ఆ వ్యక్తి ఆ గ్లాసువంక ఆశగా చూసి దాన్నందుకుని తాగడానికి అవకాశంకోసం చూస్తున్నాడు. అసంకల్పి తంగా నేనూ కాఫీ సగం వదిలిపెట్టి గ్లాసును యింతకు ముందతను ఉంచిన చోటే ఉంచి గబగబా దూరంగా నడిచి మనుషుల వెనక నిలబడి ఆ వ్యక్తిని చూడసాగాను.

అతను దొంగలా ఎంగిలి గ్లాసుల వద్దకు నడిచి రెండు గ్లాసుల్లోని కాఫీని ఒకే గ్లాసులోకి ఒంపుకుని ఆ తర్వాత.. అతి సాధారణంగా నేనూ మీరూ కాంటీన్‌లో ఇరవై పైసల బిళ్ళ పడేసి కాఫీ తీసుకుని ప్లాట్‌ఫాంమీద నిలబడి కాఫీ తాగమంటే ఎలా తాగుతామో....ఆ వ్యక్తి అలా స్టైయిల్‌గా అందరిపక్కనా తనూ నిలబడి కాఫీ త్రాగసాగాడు.

నా గుండెలో ఏదో నరం మెలితిరిగి నట్టయింది.

—వేమూరి సత్యనారాయణ